వరికి తెగుళ్లు.. రైతుల ఇక్కట్లు

- నివారణా చర్యలు చేపట్టకపోతే తీవ్రనష్టం
- సాగుకు పెరుగుతున్న వ్యయం



భీమడోలు మండలం పాతూరులో ఎండాకు తెగులను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి (ఫైల్), (ఇన్‌సెట్) వరిలో ఎండాకు తెగులు

దెందులూరు: జిల్లాలో వరి పంటను ఏటా అధికంగా సాగు చేస్తున్నారు. ఈ జిల్లా పూర్తిగా వ్యవసాయ ఆధారిత ప్రాంతం. ఈ ఏడాది రూ.3.75 లక్షల హెక్టార్లల్లో వరిసాగు చేశారు. తరుచూ తుఫాన్లు, వరదల వల్ల తెగుళ్ల అధికమయ్యాయి. అధిక పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతన్నకు ప్రకృతి సహకరించక పంటలకు తెగుళ్ల వచ్చి దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వీటిపై ఏరువాక కేంద్రం సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ ఫణి రైతులకు వర్షాలు, వరదల వల్ల పంటలను ఆశించిన ఎండాకు తెగులు నివారణపై సూచనలు సలహాలు తెలియజేశారు.

అధిక వర్షాల వల్ల బ్యాక్టీరియా ఐసోలేట్ తెగులును పూర్తిగా తట్టుకోలేని బీపీటీ 5204, పీఎల్‌ఏ 1100, ఎంటీయూ 1318, సంపద సవర్ణ, పీఆర్ 126 వంటి రకాల సాగు అధిక నత్రజని వాడకం, పొటాషియం వాడకపోవడం, తెగుళ్ల సోకిన పొలం నుంచి ఆరోగ్యవంతమైన పొలాలకు సాగు నీటి ప్రవాహం వంటి పరిస్థితులు బ్యాక్టీరియా ఎండాకు తెగులు సమస్యాత్మకంగా మారింది. ఈ తెగులు వరి పంట ఏ దశలోనైనా ఆశిస్తుంది. నివారణా చర్యలు చేపట్టకపోతే తీవ్రమైన నష్టాన్ని కలుగచేసే అవకాశం ఉంది. తెగులు నివారణకు సరైన మందులు లేవు. లక్షణాలపై అవగాహన ఏర్పాటు చేసుకుని సిఫార్సు చేసిన యాజమాన్య పద్ధతులు పాటించడం వల్ల నష్టాన్ని చాలా వరకు తగ్గించుకునే అవకాశం ఉంటుంది.

కర్షక దశ

నారుమడి దశ నుంచి నాట్లు వేసిన నెల రోజులు వరకు పొలంలో మొక్కలు అక్కడక్కడ పసుపు రంగుకు మారి చనిపోతున్నాయి. ఇది ఎండాకు మొదటి దశ అయిన కర్షక దశ. నారుమడిలో ఆకుల అంచుల నుంచి లోపలివైపుకు నీటి డాగు మచ్చలుగా ఏర్పడి క్రమేపీ పసుపు రంగుకు మారతాయి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు దుబ్బులో కొన్ని పిలకలు, దుబ్బు మొత్తం చనిపోతుంది. ఇవన్నీ కర్షక దశ అని పిలుస్తాము. రైతులు ఈ లక్షణాలను కాండం కుళ్లు, దుబ్బుకుళ్లు, తెగులుగా భావించి శిలీంద్ర నాసినులు పిచికారీ చేస్తున్నారు. దీనివల్ల తెగులు నివారణ సరిగ్గా చేయకపోవడం వల్ల సాగుఖర్చు పెరుగుతోంది. రైతులు తెగులు నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఊజు పరీక్ష

తెగులు నిర్ధారణకు ఎండిన ఆకులను చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి మంచినీటితో ఉంచిన గాజు గ్లాసులో వేయాలి. ఇలా చేయడం వల్ల తెగులు చేసిన భాగాల నుండి బ్యాక్టీరియా నీటిలోకి క్రమించడం వల్ల కొద్ది గంటలు తరువాత నీటి గాఢత పెరగడం, పసుపు రంగుకు మారుతాయి. ఈ లక్షణాల ఆధారంగా ఆ పంటను ఎండు తెగులు ఆశించినట్లు గుర్తించాలి.

ఎండు తెగులు దశ

సాధారణంగా పిలకలు కట్టే దశలో ఎడతెరిపి లేకుండా గాలులతో కూడిన వర్షాలు పడుతున్నా వాతావరణంలోనూ, ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెంటీగ్రేడ్ కంటే తక్కువగా ఉన్న వాతావరణంలో దగ్గర దగ్గర నాట్లు వేసిన పొలాల్లో అధికంగా నత్రజని వాడిన పొలాల్లో మంచు ఎక్కువగా పడే వాతావరణంలో ఈ తెగులు ఎక్కువగా ఆశించి నష్టం కలిగిస్తుంది.

ఈనిక దశ

చివరిదశలో అనగా పంట ఈనికదశలో తెగులు పంట ఆశించినట్లు అయితే పిలకలుఎండిపోయి, కొన్ని ఈనలు బయటకు రావడం, వచ్చినా పాక్షికంగా రావడం, తాళ్లు గింజలు ఏర్పడటం జరుగుతుంది.

తెగులు నివారణ యాజమాన్య పద్ధతులు



తెగులు సోకని ఆరోగ్యవంతమైన పొలం నుండి మంచి విత్తనం సేకరించాలి. తెగులు తట్టుకోలేని ఎంటీయూ, 1127 రకాన్ని వీలైనంత వరకు సార్వాలో సాగు చేయకూడదు. ఒక లీటరు నీటిలో పది గ్రాముల ల్యాంటోమైసిన్, 90 శాతం టెట్రాసైక్లిన్, హైడ్రోక్లోరైడ్ 10 శాతం కలిపి నీటిలో విత్తనం నానబెట్టి విత్తు కోవడం ద్వారా తెగులును కొంత వరకు నివారించుకోవచ్చు. ఒక లీటరు మందు ద్రావణం ఒక కిలో విత్తనానికి సరిపోతుంది. తెగులు కలగచేసే బ్యాక్టీరియా నేలలో మొక్కల అవశేషాలను పంట వ్యర్థాల్లో ఉంటుంది కాబట్టి నేలను బాగా దమ్ము చేసుకోవాలి. నత్రజని ఎరువులను సిఫార్సు చేసిన మేరకే రెండు, మూడు దఫాలుగా వాడాలి. ఎంపీటీయూ రైస్ 1318 వంటి రకాలను 24 కిలోలు, ఎకరాకు నత్రజని మాత్రమే వాడాలి. పొలం గట్లపై బ్యాక్టీరియాకు ఆవాసం కల్పించే తుంగ, చిత్తేర, గరిక, ఊద, గాబేరు వంటి గడ్డి జాతి కలుపును నివారించాలి. తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పొలంలో నిలిచిన నీటిని రెండు, మూడుసార్లు ఏటికాలువల ద్వారా బయటకు తీసివేసి కొత్తనీరు పెట్టడం వల్ల నీటిలో బ్యాక్టీరియా బయటకుపోయి ఉధృతి తగ్గుతుంది. ఈ తెగులు అరికట్టడానికి లీటరు నీటికి 1.0 స్ట్రెప్టోమైసిన్ సల్ఫేడ్, టెట్రాసైక్లిన్, హైప్రోక్లోరైడ్, 2.0గ్రా, కాపర్‌హెడ్,రాక్స్ హెడ్ 53.8 కోసైడ్ కలిపి పిచికారీ చేయడం వల్ల కొంతమేర తెగులును అరికట్టవచ్చని ప్రొఫెసర్ ఫణి వివరించారు.

క్లుప్తంగా

రెవెన్యూ రికార్డుల తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య

దెందులూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ రికార్డులను శుక్రవారం దెందులూరు తహసీల్దార్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య తనిఖీ చేశారు. గ్రామాల వారీగా సర్వే నంబర్లు, పొజిషన్ వివాదాలు, ఇతర అంశాలపై దెందులూరు తహసీల్దార్ జి సుమతి, వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని వివరించారు.

వ్యాసరచన పోటీ

దెందులూరు: విద్యార్థుల్లో ప్రతిభ వెలుగు తీసేందుకు వ్యాసరచన వక్తృత్వ పోటీలు దోహదపడతాయని మండలం విద్యాశాఖ అధికారి ఏవీఎస్‌వీప్రసాద్ అన్నారు. శుక్రవారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్వచ్ఛ ఆంధ్ర వ్యాసరచన పోటీలను ఆయన ప్రారంభించారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు

దెందులూరు: ఈ నెల 25న జరిగిన రెజ్లింగ్ జిల్లాస్థాయి ఎంపికల్లో జెడ్పీహెచ్‌ఎస్ మేధిన రావుపాలెం, దెందులూరులో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు వి.హరిసీతారామయ్య, పీడీ ఎల్‌వీడీ రవిబాబు అన్నారు. 38 కేజీ విభాగంలో అండర్ – 14 ఫ్రీ స్టైల్ విభాగంలో వి.సాయిచంద్, అండర్–17ఫ్రీ స్టైల్ విభాగంలో, 45 కేజీ విభాగంలో ఎస్.శ్రీధర్, 48 కేజీల విభాగంలో టి.గణేష్, 55 కేజీల విభాగంలో పీ.పవన్‌కిషోర్, 80 కేజీల విభాగంలో ఆర్. శాంతిదీప్, అండర్–17 గ్రీకో రోమన్ విభాగంలో బి.హేమ వంశీకృష్ణ వీరంతా రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన సందర్భంగా పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, విద్యార్థులను అభినందించారు.

హౌసింగ్ ఏఈగా సతీష్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం హౌసింగ్ ఏఈగా సతీష్ నియమితులయ్యా రు. ఈయన ఇంతకుముందు ఇక్కడ వర్క్ ఇన్‌స్పెక్టరుగా పనిచేశారు.ప్రస్తుతం భీమడోలు ఏఈగా పనిచేస్తూ ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకు ఏఈగా పనిచేసిన సురేష్‌బాబు ఏలూరు అర్బన్ ఏఈగా బదిలీపై వెళ్లారు.

గ్రామాల్లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

దెందులూరు: అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని దెందులూరు మండలం పంచాయతీల విస్తరణ అధికారి మూర్తి అన్నారు. శుక్రవారం కొవ్వలి మంచినీటి చెరువును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీఓ వీ. శ్రీలత పర్యవేక్షణలో అన్ని గ్రామాల్లో నిర్దేశించిన అధికారులు ఉద్యోగులు పారిశుద్ధ్య సిబ్బంది సంయుక్తంగా చెత్త ఎత్తివేయడం, ట్యాంకుల్లో బ్లీచింగ్ చల్లించడం, క్లీనింగ్ చేయించడం, డ్రైయిన్లు శుభ్రం చేయించడం పైపులైన్లు తనిఖీ చేయడం, ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేయడం , మొక్కలు నాటడం, అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు.

వరద బాధితుల సహాయార్థం చెక్కు అందజేత

ఉంగుటూరు: వరద బాధితుల సహాయార్థం ప్రజలు అందజేసిన రూ.84,83,293 చెక్కును ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు సీఎం చంద్రబాబును అమరావతిలో కలిసి అందజేశారు. వివిధ సంస్థలు, సంఘాలు, వ్యక్తులు, ప్రజాప్రతినిధులు, గ్రామాల్లోని ప్రజలు ఈ నగదును విరాళాల రూపంలో సేకరించి ఎమ్మెల్యే ధర్మరాజుకు అందజేశారు. ఈ ఆయన మొత్తాన్ని చంద్రబాబుకు అందించారు. ధర్మరాజుతోపాటు వంగా రఘు, పాతూరి విజయకుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యను అడ్డుకున్న పోలీసులు

ఏలూరు టౌన్: దెందులూరు మండలం రామారావుగూడెంకు చెందిన బొగ్గారి భాస్కరరావు ఇంటిమీద బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అతను వాయిదా చెల్లించలేదనే కారణంగా లోన్ రికవరీ ఏజెంట్లు భాస్కరరావు ఇంటికి వచ్చి హడావుడి చేశారు. బ్యాంకు రుణం వాయిదా చెల్లించేందుకు అప్పు అడిగేందుకు వెళుతున్నా అని చెప్పి స్కూటీపై బయలుదేరిన భాస్కరరావు పెదవేగి మండలం వేగివాడ బ్రిడ్జి వద్ద వాహనాన్ని ఆపి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని, పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలంటూ భార్య రత్నకుమారికి చెప్పాడు. భార్య వెంటనే డయల్ 112కు మధ్యాహ్నం 3.27 గంటలకు కాల్ చేసి సమాచారం అందించింది. తక్షణమే స్పందించిన పెదవేగి స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసు కాలువ వద్దకు వెళ్లగా కాలువలోకి దూకేందుకు ప్రయత్నిస్తున్న బాధితుడు భాస్కరరావును నిలువరించాడు. కౌన్సెలింగ్ ఇచ్చి అతడ్ని కుటుంబ సభ్యులకు అప్పగించాడు.

3 నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

దెందులూరు: గోపన్నపాలెంలో వచ్చే నెల 3 నుంచి 13వ తేదీ వరకు గోపన్నపాలెంలో కనకదుర్గ తల్లి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్టు ఆలయకమిటీ తెలిపింది. 3న ఉదయం 8.49 గంటలకు గ్రామస్తులు గ్రంధి ప్రభాకరరావు సత్యభామ దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉత్సవాలను ప్రారంభిస్తారని, సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, నాయకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, ఘంటసాల వెంకటలక్ష్మి, మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు) అతిథులుగా విచ్చేస్తారన్నారు.

ఓహెచ్‌ఆర్ ట్యాంకుకు శంకుస్థాపన

భీమడోలు: గుండుగొలనులోని హౌసింగ్ కాలనీలో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.50 కోట్లతో నిర్మించనున్న ఓవర్‌హెడ్ ట్యాంకు, భీమడోలు దిగుడుపాటిదిబ్బలోని హౌసింగ్ కాలనీలో రూ.56.22 లక్షలతో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ మంచినీటి సదుపాయం లేని గ్రామాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందించాలన్న లక్ష్యంతో ట్యాంకులను నిర్మిస్తున్నామన్నా రు. తహసీల్దార్ బి.రమాదేవి, ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, వివిధ శాఖల అధికారులు, పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధికి సమష్టి కృషి

- ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి
- రూ.10.22 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులకు తీర్మానం


ఉంగుటూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజ్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికార్లు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం నిర్వహించిన మండల సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధికి ప్రజాసమస్యలు పరిష్కారానికి సర్పంచులు, ఎంపీటీసీలు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ధర్మరాజు గ్రామాలు అభివృద్ధికి ఆయన సూచనలు మేరకు ముందుకు వెళదామన్నారు. సమావేశంలో 108 ఎన్‌ఆర్‌జీఎస్ పనులు రూ.10.22 కోట్లు నిధులుకు చెందిన ప్రతిపాదన తీర్మానం మండలపరిషత్తు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఎంపీడీవో రాజ్‌మనోజ్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై పంచాయతీలు దృష్టి సారించాలని అన్నారు. ఉంగుటూరు సర్పంచి బండారు సింధు మాట్లాడుతూ బస్టాండ్లవద్ద బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కాగుపాడుకు రహదారి అధ్వానంగా ఉందని సర్పంచి కడియాల సుధీష్ణ అన్నారు. కాగుపాడు–దొంతవరం రహదారి బాగుచేయాలని దొంతవరం సర్పంచి కంబంపాటి సత్యవతి సమావేశం దృష్టికి తెచ్చారు. సచివాలయ ఆర్బీకే భవనాలను పూర్తి చేయాలని ఎ.గోకవరం సర్పంచి మీద్దే సత్యవతి చెప్పారు. ఉప్పాకపాడు ఎంపీటీసీ మంగరాజు, కాకర్లమూడి సర్పంచి నాగు పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో మల్లేశ్వరరావు మాట్లాడుతూ గతేడాది 1953 ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు రూ.12.6లక్షలు పనులు చేసినట్టు వివరించారు. చేబ్రోలు, కైకరం, ఉంగుటూరు, బొమ్మిడి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులు చేయాలని సంబంధిత సోషల్ వెల్ఫేర్ అధికార్లు సమావేశం దృష్టికి తెచ్చారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో మనోజ్ సర్పంచులు, ఎంపీటీసీలకు ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి పరిచయం చేశారు. హౌసింగు ఏఈ సురేష్, ఏవో ప్రవీణ్‌కుమార్ సమావేశంలో మాట్లాడారు. జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైస్ ఎంపీపీ విద్యాభారతి, తహసీల్దారు బొడ్డేపల్లి ప్రసాదు వేదికను అలంకరించారు.

సచివాలయ భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం


భీమడోలు సచివాలయం 2 భవనంలోకి తహసీల్దార్ కార్యాలయం

భీమడోలు: ఇకపై భీమడోలు సచివాలయం- 2 భవనం తహసీల్దార్ కార్యాలయంగా మారనుంది. ఈనెల 28వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు సచివాలయంలోకి వెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇకపై ఈ భవనంలోనే రెవెన్యూ శాఖకు చెందిన కార్యాకలాపాలు కొనసాగనున్నాయి. సచివాలయం 2 భవనం బోర్డును తొలగించి తహసీల్దార్ కార్యాలయం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఉన్న సచివాలయం -2ను పక్కనే ఉన్న ఆర్‌బీకేల్లోకి మార్చారు. ఆర్‌బీకేలో సచివాలయం–2, ఆర్‌బీకేలు ఒకే చోట పని చేస్తాయి. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రతి గ్రామంలోని లక్షలాది రూపాయలు విలువ చేసే సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజ్ క్లినిక్‌లు వంటి శాశ్వత భవనాలను నిర్మించి గ్రామాభివృద్ధికి పెద్ద పీట వేశారు. శిథిలావస్థలో భవనం... బిక్కుబిక్కుమంటూ విధుల నిర్వహణ శీర్షికతో గత నెల 31న సాక్షిలో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ ఉన్నతాధికారులు స్పందించారు. దశాబ్దాల క్రితం నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. శ్లాబ్ నుంచి ఇసుక ఊచలు దర్శనమిస్తున్నాయి. దీనితో పాటు అర్జీదారులు సైతం కార్యాలయంలోకి అడుగు పెట్టేందుకు భయపడుతున్నారు. దీనితో ఉన్నతాధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సచివాలయం–2లోకి మార్చేందుకు తగు ఆదేశాలు అందించారు.

వివిధ పోటీల్లో ప్రతిభ చూపిన చిన్నారులు


మండలస్థాయి పోటీల నిర్వహణను పరిశీలిస్తున్న ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్‌కుమార్

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వర్ణాంధ్ర 2027 కార్యక్రమంలో భాగంగా వివిధ ఉన్నత పాఠశాలల బాలబాలికలకు విద్యారంగంలో తీసుకుని రావాల్సిన విద్యా సంస్కరణలు అనే అంశంపై మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఉన్నత పాఠశాలలకు చెందిన బాలబాలికలకు వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల నిర్వహణను ఎంఈవో 2 అయినపర్తి భాస్కర్ కుమార్ పరిశీలించారు. మండల స్థాయిలో ఎంపికైన ముగ్గురు విజేతలను జిల్లాస్థాయి పోటీలకు పంపుతామని ఆయన పేర్కొన్నారు. మండల స్థాయిలో వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన ఎల్.యశస్విని (భీమడోలు), వక్తృత్వం పోటీల్లో ప్రథమ స్థానం పొందిన వి.వెంకటదుర్గారావు (భీమడోలు), డిబేట్‌లో ప్రథమ స్థానం సాధించిన సీహెచ్ నాగ వెంకటదుర్గారావు (గుండుగొలను) ఎంపికయ్యారు. ఈనెల 28న ఏలూరులోని ఈదర సుబ్బమ్మదేవి మునిసిపల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో వారంతా పాల్గొన్నాలని ఎంఈవో కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.శ్రీనివాస రావు, ఉపాధ్యాయులు విజయసింహ, దుర్గారావు, సీఆర్‌ఎంటీలు ఎన్‌వీఎస్ సత్యప్రసాద్, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి


కాశిపాడులో ప్రదర్శన చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రస్తుతం ప్రజలను పట్టి పీడిస్తున్న జ్వరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. శుక్రవారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కాశిపాడులో ప్రజలకు జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మురుగునీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు.

విధుల్లో చేరిన పీహెచ్‌సీ డాక్టర్లు

దెందులూరు: ఎట్టకేలకు పీహెచ్‌సీ డాక్టర్లు సమ్మెను విరమించామనీ పీహెచ్‌సీ డాక్టర్ల రాష్ట్ర యూనియన్ ఏలూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రరావు అన్నారు. శుక్రవారం డాక్టర్లు విధుల్లో చేరారు. డాక్టర్ల భవిష్యత్తు ఉన్నతిని అడ్డుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోను వ్యతిరేకిస్తూ గత 16 రోజులుగా డాక్టర్ల యూనియన్ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు విధుల నిరసన సమ్మె, ర్యాలీలు, వినతిపత్రాలు ఇచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

సువార్త ప్రకటన విశ్వవ్యాప్తం కావాలి


ప్రార్థనలు చేస్తున్న సువార్తీకులు

దెందులూరు: సువార్త ప్రకటన విశ్వవ్యాప్తం కావాలని కొవ్వలి బేతేలు ప్రార్థన మందిరం పాస్టర్ విలియమ్స్ అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ నగర్‌లోని బేతేలు ప్రార్థన మందిరంలో ఉపవాస పండుగలు నిర్వహించారు. తొలుత వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సువార్తీకులు బైబిల్ వాక్యాన్ని అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చర్చి పాస్టర్ విలియమ్స్ మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవన విధానంలో ఉపవాసం ఎంతో‌ప్రాముఖ్యతగల అంశం అన్నారు. ఏలూరు, పెదవేగి, భీమడోలు, పెదపాడు, దెందులూరు మండలాల్లో నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు ఉపవాస పండుగలు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో మెరిసిన సీఆర్‌ఆర్ విద్యార్థులు

పెదపాడు: నవంబరు 24న ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ పోటీలు సబ్ జూనియర్, జూనియర్స్ విభాగంలో స్థానిక ఏఎస్‌ఆర్ స్టేడియం మైదానంలో నిర్వహించిన పోటీల్లో సర్ సీఆర్‌ఆర్ పాలిటెక్నిక్ విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని అండర్ 18, అండర్ 20 విభాగాల్లో 9 బంగారు, 10 వెండి, 3 రజత పథకాలను సాధించారు. అండర్ 18 విభాగంలో 2 బంగారు, 3 వెండి, అండర్ 20 విభాగంలో 7 బంగారు, 7 వెండి 3 రజత పథకాలను సాధించారు. దీంతో వారిని సీఆర్‌ఆర్ విద్యాసంస్థల యాజమాన్య కార్యదర్శి యం.బి.యస్.వి. ప్రసాద్, కరస్పాండెంట్ యం. జయప్రకాష్, ప్రిన్సిపాల్ సీహెచ్ సతీష్‌బాబు అభినందించారు. విజేతలను అక్టోబర్‌లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కాలేజీలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అతిథి వ్యాయామ అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: నారాయణపురం ఎస్‌ఏఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి వ్యాయామ అధ్యాపక పోస్టుకు ఎంపిక నిర్వహించనున్నట్టు దరఖాస్తు చేసుకోవచ్చునని ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. ఈ పోస్టు పూర్తిగా తాత్కాలిక పద్ధతి మాత్రమేనని తెలిపారు. ఎంపీఈడీలో 55శాతం మార్కులు లేదా స్లెట్ పీహెచ్‌డీ బోధనానుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇస్తామనితెలిపారు. అభ్యర్థులు ఈనెల 30లోపు, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అక్టోబరు 3న మౌఖిక పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ వివరించారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి

భీమడోలు: విద్యార్థి దశలో కష్టపడి కాదు.. ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని భీమడోలు ఎంఈవో 1 ఈదుపల్లి శ్రీనివాసరావు అన్నారు. భీమడోలు మాధురి జూనియర్ కళాశాలలో శుక్రవారం వ్యక్తిత్వ వికాసం, చదవడం మాకిష్టం, నైతిక విలువలతో కూడిన విద్య అంశంపై కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కళాశాల ఇన్‌చార్జి పి.బాలరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు, కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి నేతల పాపాల ప్రక్షాళనకు ఆలయాల్లో పూజలు


అప్పన ప్రసాద్

దెందులూరు: కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వైభవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం పేరు ప్రఖ్యాతిని, ప్రసాదమైన లడ్డూ పవిత్రతను రాజకీయ దుర్బుద్ధితో కావాలని అబద్ధాలు ఆడుతున్న కూటమి నేతల పాపాల ప్రక్షాళనకు వైఎస్సార్‌సీపీ అధినేత, రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలయాల్లో పూజలకు పిలుపునిచ్చారని దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అప్పన ప్రసాద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేసి కూటమినేతలకు మంచి బుద్ధుని ప్రసాదించాలని ఆ దేవదేవుని కోరాలని అన్నారు. లడ్డూలో కల్తీ జరిగిందని ఆరోపించిన చంద్రబాబు నిజాలు నెగ్గ తేల్చేందుకు సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదనే దానిపై అనుమానంగా ఉందన్నారు. ఒకవైపు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాలు నిగ్గుతేల్చండి, సీబీఐ విచారణకు లేదా సింగిల్ సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించమని నేరుగా భారతదేశ ప్రధానికి లేఖ రాస్తే చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్, కూటమి నాయకులు మౌనం వహించడం రాష్ట్ర ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు విచారణకు ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. శనివారం అన్ని దేవాలయాల్లో అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని అప్పన ప్రసాద్ కోరారు.

అంబేడ్కర్‌ను అవమానించిన వారిపై చర్యలేవీ?


గణపవరంలో ఆందోళన చేస్తున్న దళిత సంఘాల నేతలు

గణపవరం: ఉండి నియోజకవర్గం కాళ్లమండలం ఏలూరుపాడులో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఫ్లెక్సీని బలవంతంగా పీకివేసిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజుపై కఠిన చర్యలు తీసుకోవాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లిరాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం గణపవరం మండలం సరిపల్లెలో అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఈసంఘటనకు కారణమైన వారిపై ప్రభుత్వం ఇంతవరకూ చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటన్నారు. ఈవిషయంపై రాష్ట్రవ్యాప్తంగా వారం రోజులుగా ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు చేస్తున్నారని, ప్రభుత్వం ఈవిషయంలో అలసత్వం వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈవిషయంలో గవర్నర్ జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. మాలమహానాడు నాయకులు నల్లి రాజీభాయ్, బుర్కా ఏసు, గారపాటి నానాజీ, తండా ఇస్సాక్, విప్పర్తి నవీన్, పాలపర్తి కృపానాథ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


గుండుగొలనులో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం జీకేడీ సునీత, పీడీలు వెంకటేశ్వరరావు, కృష్ణారావు


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

భీమడోలు: పెదవేగిలో నిర్వహించిన స్కూలు గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 10 మంది క్రీడాకారులు చక్కని ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభను చూపిన క్రీడాకారులను హెచ్ఎం గారపాటి కనకదుర్గాసునీత అభినందించారు. పెదవేగిలో స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీలు జరిగాయన్నారు. పోటీల్లో పాఠశాలలకు చెందిన 10 మంది క్రీడాకారులు 15 సెలెక్షన్లలో తమ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్ 17 విభాగంలో గంటా అజయ్, వల్లెపు తేజ, బి.వీరమణికంఠ, ఏకుల నాగదుర్గ, జంగం లక్ష్మీప్రసన్నలు, అండర్ 14 విభాగంలో ఇళ్ల దుర్గాభవానీ, సివాపు వెంకట లలిత, దార అనన్య, ముత్తారపు శశికిరణ్, గిట్టా కల్యాణ్‌బాబు ఎంపికయ్యారని హెచ్ఎం సునీత, పీడీ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. వారికి తర్ఫీదునిచ్చిన పీడీలు వి.వెంకటేశ్వరరావు, కృష్ణారావును అభినందించారు. ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

గణపవరం: గణపవరం బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జిల్లాస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు ఎంపికైనట్లు హైస్కూలు పీడీ పద్మావతి తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో ఉంగుటూరు మండలం కైకరంలో నిర్వహించిన పోటీల్లో అండర్ 17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో భానుచరణ్, గోకుల్‌కృష్ణ, హైజంప్‌కు అఖిల్‌శ్రీవర్మ, అండర్ 14 వాలీబాల్ పోటీలు, అండర్ 14 కబడ్డీ పోటీలో పవన్ జిల్లాస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. విజేతలను హెచ్ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

దంత వ్యాధులపై నిర్లక్ష్యం తగదు


ప్రభుత్వ డిగ్రీ కాలేజిలో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

గణపవరం: దంత సమస్యలు, వ్యాధులపై నిర్లక్ష్యం తగదని, సకాలంలో వైద్యసేవలు పొందడంవల్ల దంతాలు ఆరోగ్యవంతంగా ఉంటాయని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజి ప్రిన్సిపల్ నిర్మలకుమారి అన్నారు. శుక్రవారం డిగ్రీ కాలేజి ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో భీమవరం విష్ణు దంత వైద్య కళాశాల దంత వైద్యులు విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. దంత సంరక్షణపై వైద్యులు పలు సూచనలు ఇచ్చారు. దంత కళాశాల వైద్యుడు కేఎస్ చైతన్యరామ్ ఆధ్వర్యంలో 15మంది దంత వైద్యుల బృందం 230 మంది విద్యార్థులకు దంత పరీక్షలు చేశారు. వీరిలో 100 మందికి దంత సమస్యలు ఉన్నట్లు గుర్తించి, ప్రాథమిక దంత వైద్యసేవలు, మందులు అందజేశారు. కూసంపూడి సురేంద్ర, నడింపల్లి శ్రీరామ్, చింతలపాటి సత్యనారాయణరాజు, వైస్ ప్రిన్సిపల్ మధురాజు, ఐక్యూఏసి కోఆర్డినేటర్ సీహెచ్ చైతన్య అధ్యాపకులు పాల్గొన్నారు.